పేద విద్యార్థులకు అండగా నిలవాలి

మణికొండ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు ప్రతి ఒక్కరు అండగా ఉండాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలోని పీఎంశ్రీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు మానస అషిత గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు లభిలాష్ రూ. 1.20 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ కె.రామకృష్ణారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు దశరథ్‌నాయక్, నాయకులు శ్రావణ్‌కుమార్, కుంమార్, బి.శ్రీరాములు, ఎం.రాఘవరెడ్డి, బి.రవికాంత్‌రెడ్డి, శివరాంరెడ్డి, శివగంగ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో జనరంజక పాలన



శ్రీనివాస్‌గుప్తాను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి: తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన కొనసాగుతోందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బాబుల్‌రెడ్డినగర్ ప్రాంతానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకకులు, కార్యకర్తలు శుక్రవారం శ్రీనివాస్‌గుప్తా ఆధ్వర్యంలో దాదాపు 200 మంది ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని అన్నారు. సోమ శ్రీనివాస్ పార్టీలో చేరడంతో బాబుల్‌రెడ్డినగర్‌లో పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. కాంగ్రెస్‌తోనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు శ్రీనివాస్‌గుప్తా తెలిపారు.

వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం



రాజేంద్రనగర్: వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ అత్తాపూర్ సూర్య భగవాన్ ఆలయ ఆవరణలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ అనంతరం అభిషేకం, పూజ కార్యక్రమాలను నిర్వహించారు. కల్యాణోత్సవానికి పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

ఘనంగా ఆలయ పునర్నిర్మాణ పూజలు



హోమంలో పాల్గొన్న భక్తులు

రాజేంద్రనగర్: బుద్వేల్ గ్రామంలోని పురాతన ఈదమ్మ పోచమ్మ ఆలయ పునర్నిర్మాణ పూజలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా రాజు పంతులు ఆధ్వర్యంలో వేద పండితులు భక్తిశ్రద్ధలతో హోమం నిర్వహించారు. గ్రామ పెద్దలు కొరని సదానంద్, కొరని బాల్‌రాజ్, కొరని దయానంద్, కొరని దేవదానం, కొరని అర్జున్, కొరని శ్యామ్, కొరని బాబురావు, కొరని నరేందర్, కొరని యాదయ్య, గుంటి సత్యం తదితరులు పాల్గొన్నారు.

హుక్కా పార్టీపై పోలీసులు దాడి: ఏడుగురి అరెస్టు



పోలీసులు అదుపులో నిందితులు

శంషాబాద్ రూరల్: అనుమతి లేకుండా హుక్కా పార్టీ నిర్వహిస్తున్న ఏడుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గండిగూడ గ్రామంలో ఉన్న ఎంఆర్‌జీ ఫాంహౌస్‌లో గురువారం రాత్రి కొందరు హుక్కా పార్టీ జరుపుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడులు నిర్వహించారు. వారి వద్ద హుక్కా తాగే పరికరాలు, ఒక స్కూటీ, ఐదు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మెరిసిన మువ్వన్నెల జెండా



బండ్లగూడ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తదితరులు



రాజేంద్రనగర్ విద్యుత్ కార్యాలయంలో దీక్ష రత్నాకర్‌రావు



మణికొండ మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రావు



నార్సింగి మార్కెట్ కమిటీ వద్ద చైర్మన్ వేణుగౌడ్, డైరెక్టర్లు



మహ్మద్‌నగర్‌లో అత్తాపూర్ పోలీసులు

స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వాడవాడలా జాతీయ జెండాలను ఆవిష్కరించి అలనాటి స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్న నేతల త్యాగాలను స్మరించుకున్నారు. బండ్లగూడ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. పాఠశాలలు, పోలీస్‌స్టేషన్లు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే పాఠశాలల్లో విద్యార్థులు బస్తీల్లో ఊరేగింపు నిర్వహించి భారత స్వాతంత్య్ర ఘట్టాలను తెలియజేసే పాటలు పాడుతూ దేశభక్తిని చాటుకున్నారు. విద్యార్థులు జాతీయ నేతల వేషధారణలో విశేషంగా ఆకట్టుకున్నారు. – రాజేంద్రనగర్ జోన్ బృందం



ఖానాపూర్‌లోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరిస్తున్న చైర్మన్ కృష్ణ, పాల్గొన్న డైరెక్టర్లు



బండ్లగూడలో ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో



హైదర్షాకోట్‌లో జెండా ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి



నార్సింగి మున్సిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి



అత్తాపూర్ ప్రభుత్వ పాఠశాలలో..



విజయ ఆయిల్ ఫెడ్ యూనిట్ మేనేజర్ తిరమలేశ్‌రెడ్డి తదితరులు



కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో...



రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో..



ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వీసీ జానయ్య



శంషాబాద్ బీఆర్‌ఎస్ కార్యాలయంలో పార్టీ సీనియర్ నేత కార్తీక్‌రెడ్డి



శంషాబాద్ ప్రభుత్వాసుపత్రిలో డాక్టర్ దుర్గలత



మాణిక్యమ్మ కాలనీలో చిన్నారులు

పోలీస్ అకాడమీలో 'తరంగ జ్యోతి' శిక్షణ కేంద్రం

బండ్లగూడ: తెలంగాణ పోలీస్ అకాడమీలో శుక్రవారం స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. రాణిరుద్రమదేవి ఆడిటోరియం ఎదుట జాతీయ జెండాను ఆవిష్కరించి అధికారులు, సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ... దేశాభివృద్ధిలో మనమందరం పాలుపంచుకోవాల్సి ఉందన్నారు.

తరంగ జ్యోతి శిక్షణ కేంద్రం ప్రారంభం...

పోలీస్ అకాడమీ అధికారుల సిబ్బంది పిల్లల విద్యాభివృద్ధికి చదువులో నైపుణ్యం సాధించేందుకు అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ వినూత్న చర్యలు చేపట్టారు. అక్కడ ఉండే పిల్లలకు రోజూ సాయంత్రం రెండు పీరియడ్స్ క్లాసులు కంప్యూటర్ లోనూ, చెస్‌లోనూ, ఇంగ్లిష్ భాషలోనూ నైపుణ్యం సాధించేందుకు ప్రత్యేక క్లాసులు నిర్వహించేందుకు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. ఇక్కడ ప్రత్యేకంగా గెస్ట్ ఫ్యాకల్టీను ఏర్పాటు చేశారు. గతంలోనూ డైరెక్టర్ అభిలాష బిస్త్ స్టేబుల్ శిక్షణలోనూ మహిళా ట్రైనీలైన ఫీడింగ్ మదర్స్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దాదాపు సిబ్బంది పిల్లలకు 61 మందికి ఈ ప్రత్యేకమైన క్లాసెస్ నిర్వహణకు తరంగ జ్యోతి శిక్షణకేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఇండక్షన్ డీడీ కవిత, ఔట్ డోర్ డీడీ శ్రీరామమూర్తి, అసిస్టెంట్ డైరెక్టర్లు వి.శ్రీనివాసరెడ్డి, కె.ఆర్.కె.ప్రసాద్, వి.శ్రీనివాస్‌రావు, నరహరి, ధనజ, డాక్టర్ రమాదేవి, డీఎస్పీలు సతీష్, రామారావు, బాలయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



జెండా వందనం చేస్తున్న డైరెక్టర్ అభిలాష బిస్త్

పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్‌కోట్ల పంపిణీ

శంషాబాద్ రూరల్: స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా మండలంలోని రామాంజాపూర్‌లో పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు శుక్రవారం దాత మహేష్‌కుమార్ రెయిన్‌కోట్లు పంపిణీ చేశారు. పదో తరగతిలో ప్రథమ స్థానం పొందిన విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తానని హామీ ఇచ్చారు. వర్షాలతో పాఠశాల ఆవరణలో చేరుతున్న వరదనీటి సమస్య పరిష్కారానికి సహాయం చేస్తానని తెలిపారు.



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



శంషాబాద్: పీఏసీఎస్ పాలకవర్గాల పదవికాలం మరో ఆరునెలల పాటు ప్రభుత్వం పొడిగించడంతో శంషాబాద్ పీఏసీఎస్ పాలకవర్గ సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సదర్భంగా శంషాబాద్ పీఏసీఎస్ చైర్మన్ ముద్దం మల్లారెడ్డి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతు పక్షపాతి అన్నారు. అన్నదాతల కోసం పీఏసీఎస్‌లను బలోపేతం చేసే దిశగా సర్కారు చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ జ్ఞానేశ్వర్‌యాదవ్, పాలకవర్గ సభ్యులు రంగారెడ్డి కరుణాకర్‌రెడ్డి, ఇంజమూరి సత్తయ్య, మాజీ సర్పంచ్ ఆర్. గణేష్‌గుప్తా, మాజీ కౌన్సిలర్లు వై. కుమార్, పి.సంజయ్‌యాదవ్, అజయ్, నాయకులు మహేందర్‌రెడ్డి, శ్రీధర్‌యాదవ్, రాచలమల్ల దాసు, పీఏసీఎస్ సీఈఓ అర్జున్, ఉద్యోగులు జగన్, ఫిలోమెన్‌రాజు, రాంరెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని మహిళ మృతి



మృతి చెందిన మంజుల

మణికొండ: బతుకుదెరువు వచ్చి గృహాల్లో పనిచేసుకుంటున్న ఓ మహిళను శుక్రవారం ఓ ద్విచక్రవాహనం ఢీ కొట్టడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన నార్సింగి మున్సిపాలిటీలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మహబూబాబాద్ జిల్లా కన్నాయిగూడెంకు చెందిన టి.మంజుల(44) నార్సింగిలో నివసిస్తూ పలు గృహాలలో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తుంది. రోజూలానే బృందావన్ కాలనీలో పనిముగించుకుని ఇంటికి వెల్తున్న క్రమంలో నార్సింగి– గండిపేట మెయిన్ రోడ్డును దాటుతున్న క్రమంలో పాలామీ–90 అపార్ట్‌మెంట్ ముందు ఏపీ 26సీబీ 2626 నెంబరు ద్విచక్ర వాహనం వేగంగా ఢీ కొట్టింది. దాంతో ఆమె తల, నడుము కింది భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను నార్సింగిలోని పల్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆస్పత్రి వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు.

ఘనంగా వరలక్ష్మి పూజలు

మణికొండ: శ్రావణ శుక్రవారం సందర్భంగా మణికొండ మున్సిపాలిటీ పరిధిలో మహిళలు పెద్ద ఎత్తున వరలక్ష్మి పూజలను ఆచరించారు. ఉదయం నుంచే గృహాలలో మండపాలను సిద్ధం చేసుకుని పూజల్లో పాల్గొన్నారు. అమ్మవార్లకు ఐదు రకాల ప్రసాదాల నైవేద్యాన్ని పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఆర్యవైశ్య అఫిషియల్స్, ప్రొఫెషనల్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో పుప్పాలగూడ శివాలయంలో సామూహికంగా వరలక్ష్మి వ్రతాలను ఆచరించారు.

సిద్ధులగుట్ట జాతరకు సర్వం సిద్ధం



శంషాబాద్‌లోని వెండికొండ సిద్ధేశ్వరాలయం



- నేటి నుంచి ప్రారంభం కానున్న జాతర
- సర్వాంగ సుందరంగా ముస్తాబైన వెండికొండ
- బసవేశ్వరాలయం నుంచి ఊరేగింపుతో ప్రారంభం

శంషాబాద్: వెండి కొండ సిద్ధేశ్వరాలయం (సిద్ధుల గుట్ట) జాతరకు ముస్తాబైంది. శంషాబాద్ పట్టణంలోని పాలరాతి కొండపై కొలువుదీరిన జంగమయ్యకు ఏటా శ్రావణమాసంలో మూడు రోజుల పాటు జాతర ఘనంగా నిర్వహిస్తారు. దాదాపు ఏడు దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ జాతర శనివారం నుంచి ప్రారంభమై మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరుగనుంది.

ఊరిగింపుతో మొదలై...

రుద్రాభిషేకం అనంతరం పట్టణంలోని బసవేశ్వరాలయంలో శనివారం సాయంత్రం ఊరేగింపు మొదలవుతుంది. పట్టణ ప్రజలు పల్లకిలో వైభవంగా స్వామివారిని ఊరేగించి సిద్ధులగుట్ట దేవాలయానికి తీసుకెళతారు. రాత్రి 8 గంటల తర్వాత గణపతి, ఆంజనేయస్వామి అభిషేకాలు నిర్వహిస్తారు. ఆదివారం ఉదయం స్వామి వారి రుద్రాభిషేకం, అమ్మవారి అభిషేకం, కుంకుమార్చన, వీరభద్రేశ్వరస్వామి అభిషేకం, అన్నపూజ, ఆకుపూజ, అన్నప్రసాదం, రాత్రికి శివపార్వతుల కల్యాణం, భజన, సాంస్కృతిక కార్యక్రమాలు, సోమవారం అగ్నిగుండాలు, మహన్యాస రుద్రాభిషేకం, మహాబిల్వార్చన, వీరభద్రేశ్వర స్వామి అభిషేకం, కుంకుమార్చ, అమృతస్నానం, అన్నదానం, ఆశీర్వచనంతో జాతర ముగుస్తుంది.

వేలాదిగా భక్తుల రాక...

శంషాబాద్ గ్రామీణ ప్రాంతాలతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు జాతరకు విచ్చేస్తారు. పట్టణంలోని జాతీయ రహదారి బస్టాండ్ నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో సిద్ధుల గుట్ట దేవాలయం ఉంటుంది. ఆటో లు, ఇతర వాహనాలు ఇక్కడ అందుబాటులో ఉంటాయి. జాతరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను కూడా ఏర్పాటు చేస్తుంది. జాతర కోసం వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయ పాలకమండలితో పాటు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య నిర్వహణ, మంచి నీటి వసతి సంబంధిత పనులు పర్యవేక్షిస్తారు.

అధ్వానంగా రహదారులు

వేలాది మంది భక్తుల రాకతో సందడిగా మారే సిద్ధులగుట్ట దేవాలయానికి వెళ్లే రహదారులు పూర్తిగా ఛిద్రమైపోయాయి. అస్తవ్యస్తంగా మారిన రహదారులు కనీస మరమ్మతులు కూడా చేపట్టలేదు. రాళ్లగూడ వైపు నుంచి సిద్ధులగుట్టకు వెళ్లేదారి ఇప్పటికే మిషన్ భగీరథ పైపులైను పగలడంతో పాటు ఎగువ ప్రాంతంలో ఉన్న బాలాజీ వెంచర్‌లోని మురుగునీరు, వాననీటితో నిండిపోవడంతో అస్తవ్యస్తంగా మారింది. ఈ పరిస్థితి గత కొన్ని మాసాలుగా ఉన్న అధికారులు శ్రద్ధ వహించకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

